బాధితుడు శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తదితరులు

'దళిత బంధు'వుల ఆత్మహత్యాయత్నాలకు

ప్రభుత్వానిదే బాధ్యత

- రెండో విడుత డబ్బులు విడుదల చేయాలి
- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట, ఫిబ్రవరి 6: 'దళితబంధు పథకం లబ్ధిదారులైన శ్రీనివాస్, అమల ఆత్మహత్యాయత్నాలకు ప్రభుత్వానిదే బాధ్యత. ప్రభుత్వం స్పందించాలే. ఫ్రీజ్ చేసిన రెండో విడుత నిధులు విడుదల చేయాలి. ఏ ఒక్క లబ్ధిదారుడు ఆందోళన చెందొద్దు. మీకు మేమున్నం..' అని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి భరోసానిచ్చారు. మంగళవారం ఆయన సతీమణి శాలినీరెడ్డితో కలిసి జమ్మికుంటకు వచ్చారు. మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి(చర్చి కాలనీ)కి చెందిన దళితబంధు లబ్ధిదారు బొటికెల శ్రీనివాస్ రెండో విడుత నిధులు విడుదల కావడం లేదని మనస్తాపంతో ఇటీవల ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకొని ఆత్మహత్యకు యత్నించగా, బాధితుడిని ఎమ్మెల్యే పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. దళితబంధు పథకంపై ప్రభుత్వం ఇప్పటికైనా సరైన నిర్ణయం తీసుకోకుంటే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. పథకం నిధుల విడుదలపై అసెంబ్లీలో ప్రస్తావిస్తానని తెలిపారు. లబ్ధిదారులెవరూ ఆత్మహత్యాయత్నాలకు పాల్పడవద్దన్నారు. బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం కలెక్టర్ పమేలా సత్పతితో ఫోన్‌లో మాట్లాడారు. రెండో విడుత డబ్బులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు లబ్ధిదారు శ్రీనివాస్‌ను ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ దళితబంధు సాధన సమితితో కలిసి పరామర్శించారు. ఇక్కడ మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న-కోటి, పీఏసీఎస్ చైర్మన్ సంపత్, పలువురు కౌన్సిలర్లు, నాయకులు, తదితరులున్నారు.

గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

- నేటి నుంచి 15 వరకు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ చేపట్టాలి
- కలెక్టర్ పమేలా సత్పతి

మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): నిబద్ధతతో, నిజాయితీగా తమకు అప్పగించిన బాధ్యతలను నిర్వర్తిస్తూ గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ పమేలా సత్పతి గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులకు సూచించారు. నగరంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విధుల్లో నిర్లక్ష్యం చేయొద్దని, గ్రామాలను సందర్శించి ప్రజలకు అవసరమైన సేవలందిస్తూ, ఆదర్శంగా తీర్చిదిద్దాలని సూచించారు. గ్రామ పంచాయతీ ప్రణాళికలు, పన్నుల వసూళ్లు, తాగునీటి సరఫరా, ఇంటి నిర్మాణ అనుమతులు తదితర అంశాలపై జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఈనెల 7 నుంచి 15వ వరకు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. ఉపాధిహామీ కింద చేపట్టే పనులను మార్చిలోగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్డీవో శ్రీలత, డీపీవో వీర బుచ్చయ్య, జిల్లా వైద్యాధికారి లలితాదేవి, డీడబ్ల్యూవో సరస్వతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అమరేందర్, ఈఈ రాంకుమార్, యూనిసెఫ్ ప్రాజెక్టు సమన్వయకర్త కిషన్ స్వామి, ఎంపీవోలు జగన్మోహన్‌రెడ్డి, కిరణ్, ఎస్‌బీఎం రమేశ్, డీటీఎం సురేందర్‌రెడ్డి, డీఎల్పీవో లత, డీపీఎం ప్రసాద్ పాల్గొన్నారు.

సాధికారత దిశగా మహిళా సంఘాలు

కలెక్టరేట్, ఫిబ్రవరి 6: మహిళా సాధికారత దిశగా జిల్లాలోని స్వయం సహాయక సంఘాలు ముందుకెళ్తున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. వీరికి మరింత ఆర్థిక భరోసా కల్పించేందుకు తాజాగా జిల్లాలో రుచి, శుచితో కూడిన తినుబండారాలు ప్రజలకు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. పీఎం స్వనిధి పథకం ద్వారా జిల్లాలోని కరీంనగర్, హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి, కొత్తపల్లి మున్సిపాలిటీల పరిధిలో వీధి వ్యాపారులకు రుణాలు అందిస్తున్నట్లు వెల్లడించారు. రెండో విడుత అందించే రూ.20 వేల రుణాల మంజూరులో రాష్ట్రంలోనే జిల్లా మూడోస్థానంలో నిలిచినట్లు తెలిపారు. రుణాలు తీసుకున్న వారంతా సక్రమంగా చెల్లించేలా చూడాలన్నారు. వీధి వ్యాపారులకు ఐడీకార్డులు, రిజిస్ట్రేషన్ల జారీలో జాప్యం జరుగకుండా చూడాలని ఆదేశించారు. ప్లాస్టిక్‌ను నివారించే దిశగా మహిళా సంఘాల ద్వారా భర్తన్ బ్యాంక్ అనే వినూత్న కార్యక్రమాన్ని జిల్లాలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే, స్టీల్ వంట పాత్రలను టెంట్ హౌస్ నిర్వాహకులకంటే తక్కువ అద్దెకు అందించే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మెప్మా పీడీ రవీందర్, ఎల్డీఎం ఆంజనేయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

బీఆర్‌ఎస్ గెలుపునకు సైనికుల్లా పని చేయాలి

- కేంద్రంలో అధికారంలోకి రాకపోతే సీఎం రాజీనామా చేస్తారా
- మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్

చిగురుమామిడి, ఫిబ్రవరి 6: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని పార్టీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య అధ్యక్షతన మంగళవారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వొడితల సతీశ్ కుమార్ మాట్లాడుతూ, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాకపోతే సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేస్తారా అని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో విరక్తి వచ్చిందన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ కొత్త వినీత, వైస్ ఎంపీపీ బేతి రాజిరెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య, సింగిల్ విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, వైస్ చైర్మన్ కరివేద మహేందర్ రెడ్డి, జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి, సాంబారి కొమురయ్య, మండల ప్రధాన కార్యదర్శి మంకు శ్రీనివాస్ రెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు రామోజు కృష్ణమాచారి, మాజీ ఎంపీపీ అందె సుజాత, ఆకవరం భవాని, ఎంపీటీసీలు మల్లేశం, స్వప్న, జమున, నాయకులు శివప్రసాద్, లక్ష్మీనారాయణ, సర్వర్ పాషా, వెంకటేశం, నర్సింహారెడ్డి, శ్రీనివాస్, ప్రవీణ్, రమేశ్, ఎస్కే సిరాజ్, లక్ష్మణ్, సంపత్, వేణు, రాజేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పోచయ్య, మహేందర్ రెడ్డి, తిరుపతి, సదానందం పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఈవీఎంల ఎఫ్ఎల్‌సీ ప్రక్రియ

కలెక్టరేట్, ఫిబ్రవరి 6: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల తనిఖీ ప్రక్రియ కొనసాగుతున్నది. ఇందులో భాగంగా గోడౌన్‌లో ఈవీఎంలను భద్రపరిచిన గదులను మంగళవారం అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ నెల 5 నుంచి చేపట్టిన ఓటింగ్ యంత్రాల మొదటి స్థాయి తనిఖీలో భాగంగా వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో ఈసీఐ నిబంధనల మేరకు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్ యంత్రాల పరిశీలన చేపడుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్వో పవన్‌కుమార్, పలు పార్టీల ప్రతినిధులు మడుపు మోహన్, సత్తినేని శ్రీనివాస్, అమీన్, అనిల్, కళ్యాడపు ఆగయ్య, మిల్కూరి వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

కొత్తపల్లి, ఫిబ్రవరి 6: జిల్లా కేంద్రంలోని బోయవాడ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు కరాటే పోటీల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ పద్మజ తెలిపారు. విద్యార్థులు విశాల్, కృష్ణ, రాగశ్రీ, అక్షయ, ప్రణవ్ నీల్‌ను మంగళవారం ప్రిన్సిపాల్‌తో పాటు ఏజీఎం రాజు, డీన్ సునీల్ కాంత్ అభినందించారు.

పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

విద్యార్థులతో షీ టీం ప్రతినిధులు

షీ టీమ్స్‌పై విద్యార్థులకు అవగాహన

కొత్తపల్లి, ఫిబ్రవరి 6: కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల్లో విద్యార్థులకు మంగళవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో షీ టీమ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, షీ టీం సభ్యురాలు స్వప్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్పంచుల నిరసన

గంగాధర, ఫిబ్రవరి 6: గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని మండల తాజా మాజీ సర్పంచులు మంగళవారం గంగాధర మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఎంపీడీవో, ఎంపీవో అందుబాటులో లేకపోవడంతో సిబ్బందికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దవాఖానకు నర్సింగ్ స్టాఫ్ కేటాయింపు

విద్యానగర్, ఫిబ్రవరి 6: కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు రాష్ట్ర ప్రభుత్వం 73 మంది స్టాఫ్ నర్సులను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, వారు మంగళవారం దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డికి ఆర్డర్ కాపీలను ఇచ్చారు. నర్సింగ్ స్టాఫ్‌కు దవాఖాన సూపరింటెండెంట్ వీరారెడ్డి, ఏడీ షమీమ్, వైద్యులు అభినందనలు తెలిపారు.

దవాఖాన సూపరింటెండెంట్ వీరారెడ్డికి ఆర్డర్ కాపీ ఇస్తున్న నర్సులు

2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలి

కార్పొరేషన్, ఫిబ్రవరి 6: అధికారంలోకి రాగానే 2 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాం ఇప్పుడు కేవలం 60 గ్రూప్-1 ఉద్యోగాల నోటిఫికేషన్‌తో ఆరంభం చేశారని, ఈ నెలాఖరు నాటికి లక్ష ఉద్యోగాలను గుర్తించి షెడ్యూల్ విడుదల చేయాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పుడు 60 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చారని, మిగిలిన 1,99,940 పోస్టులను ఎప్పుడు భర్తీ చేస్తారో క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో 1,60,083 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని, 42 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు నిర్వహించిందన్నారు. అయితే కోర్టు కేసుల కారణంగా నియామకాలు జరుగలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబర్ 31 నాటికి 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు.

నేటి నుంచే ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

కరీంనగర్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో అధికారులు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమానికి సర్వం సిద్ధం చేశారు. బుధవారం నుంచి వారం పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు కలెక్టర్ పమేలా సత్పతి అన్ని గ్రామాల ప్రత్యేకాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఏ రోజు ఏ కార్యక్రమాన్ని ఎలా నిర్వహించాలో వివరించారు. కాగా, ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువత పాల్గొనేలా చూడాలని డీపీవో వీర బుచ్చయ్య ప్రత్యేకాధికారులను ఆదేశించారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం చేపట్టే ముందు, చేపట్టిన తర్వాత స్థితిని ఫొటోలు తీసి గూగుల్ డ్రైవ్‌లో అప్‌లోడ్ చేయాలని, ఈ ఫొటోలతో జిల్లా స్థాయిలో ఎగ్జిబిషన్ నిర్వహిస్తామని తెలిపారు.

సీఐల బదిలీ

రాంనగర్, ఫిబ్రవరి 6: కరీంనగర్ కమిషరేట్ పరిధిలో పలువురు సీఐలను బదిలీ చేస్తు ఐజీ తరుణ్ జోషీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మెదక్ సీసీఎస్ సీఐగా పని చేస్తున్న ప్రకాశ్ గౌడ్‌ను చొప్పదండికి బదిలీ చేశారు. చొప్పదండి సీఐ గోపతి రవీందర్‌ను కరీంనగర్ టాస్క్ ఫోర్స్ సీఐగా బదిలీ చేశారు. సీఐడీలో సీఐగా పని చేసి వెయిటింగ్‌లో ఉన్న విజయకుమార్‌ను పోలీసు కంట్రోల్ రూంకు బదిలీ చేశారు. కరీంనగర్ పోలీసు కంట్రోల్ రూం సీఐ విజ్ఞాన్ రావు, జమ్మికుంట సీఐ రమేశ్‌ను ఐజీ కార్యాలయానికి బదిలీ చేశారు.

ట్రాన్స్‌కో సీఎండీని కలిసిన విద్యుత్ ఉద్యోగులు

ముకరంపుర, ఫిబ్రవరి 6: హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధలో ట్రాన్స్ కో, జెన్‌కో సీఎండీ రిజ్వీని టీఆర్వీకేఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కేవీ జాన్సన్, కోడూరి ప్రకాశ్ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘం డైరీ, క్యాలెండర్‌ను అందజేశారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జెన్‌కో విజిలెన్స్ ఏఎస్పీ ముత్యంరెడ్డిని కలిసి డైరీ, క్యాలెండర్ అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్, జెన్‌కో కార్యదర్శి చారుగుండ్ల రమేశ్, ఎస్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు ఎండీ యూసుఫ్, ట్రాన్స్‌కో కంపెనీ కార్యదర్శి పీ రాములు, నవీన్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

భూఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 6: కరీంనగర్‌లో భూఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు బేతి మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని ప్రెస్ భవనంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో బీజేపీ నాయకులు జితేందర్‌రెడ్డి, భగవాన్, సుమన్, నరహరి, లక్ష్మణ్, రాంరెడ్డి పాల్గొన్నారు.

పుస్తెలతాడు దొంగల అరెస్ట్

గంగాధర, ఫిబ్రవరి 6: వృద్ధురాలి మెడలోని పుస్తెలతాడును ఎత్తుకెళ్లిన దొంగలను అరెస్టు చేసినట్లు చొప్పదండి సీఐ రవీందర్ తెలిపారు. గంగాధర పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొడిమ్యాల మండలం నాచుపల్లికి చెందిన ఇట్టె లక్ష్మి ఈనెల 4న గంగాధర మండలం గర్శకుర్తిలోని కూతురు ఇంటికి వెళ్లడానికి జేఎన్‌టీయూ వద్ద ఆటో ఎక్కింది. కాగా, మండలంలోని మధురానగర్ చౌరస్తాకు వచ్చిన తర్వాత లక్ష్మికి ఆటో డ్రైవర్ రాజు ఆయన భార్య పద్మావతి మాయమాటలు చెప్పి సమీపంలోని మామిడితోటలోకి తీసుకెళ్లారు. వృద్ధురాలి మెడలోని పుస్తెలతాడును ఎత్తుకెళ్లారు. లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు రాజును కరీంనగర్‌లోని కెమిస్ట్ భవన్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. రాజు, పద్మావతిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. చాకచక్యంగా నిందితులను పట్టుకున్న ఎస్ఐ అభిలాష్, సిబ్బందిని సీఐ అభినందించారు.

శానిటరీ సూపర్‌వైజర్ సస్పెన్షన్

కార్పొరేషన్, ఫిబ్రవరి 6: కరీంనగర్ బల్దియాలో పారిశుధ్య విభాగం సూపర్‌వైజర్ రాజమనోహర్‌ను సస్పెండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

వీణవంక, ఫిబ్రవరి 6: చల్లూరు నుంచి అక్రమంగా తరలిస్తున్న 40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వంశీకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వీణవంకకు చెందిన ఊబిది నరేశ్, ఓదెల మండలం హరిపురానికి చెందిన కాసారపు శ్రీనివాస్ ఇద్దరు కలిసి గ్రామాల్లో పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి, సిద్దిపేట శివారులోని ఫ్యాక్టరీల్లో విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో బియ్యంతోపాటు ట్రాలీ ఆటోను పోలీసులు పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. శ్రీనివాస్, నరేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-319433-AII

CHANGE OF NAME

★ I, CHITTIMALLA RAMADEVI, W/o. Mukka Rajalaxmaiah, R/o. 2-11-1, Market Road, Jammikunta, Karimnagar, TS. Changed My Name as MUKKA RAMADEVI, W/o. Mukka Rajalaxmaiah.
NT-311079

★ I, CHITTIMALLA SRIMANNARAYANA, S/o. Venkataiah, R/o. 8-1-105, Gandhichowk, Jammikunta, Karimnagar, TS. Changed My Name as CHITTIMALLA SREEMANNARAYANA, S/o. Venkataiah.
NT-311079

CHANGE OF NAME

★ I Narla Harika, W/o. Narla Shankar @ Before Marriage Moota Mounika D/o Moota Bhumaiah, R/o. H.No. 3-191, Jabithapur (Vill), Jagithyal Dist. after marriage changed my name as NARLA HARIKA W/O. NARLA SHANKAR.
NTK-316887

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571
91827 77194

భూఆక్రమణ కేసులో మరొకరి అరెస్ట్

రాంనగర్, ఫిబ్రవరి 6: కరీంనగర్‌లో భూ ఆక్రమణ కేసులో పోలీసులు ఇటీవల నలుగురిని అరెస్టు చేయగా, మంగళవారం మరొకరిని అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని వివేకానందపురి కాలనీకి చెందిన అనుమండ్ల రవీందర్ 2014 మేలో తీగలగుట్టపల్లి ప్రాంతంలో రోడ్ నంబర్ 16, కార్తికేయనగర్‌లో సర్వేనంబర్ 233/ఈలో 144 చదరపు గజాల స్థలాన్ని కొనుగోలు చేశాడు. ఆ స్థలానికి బేస్‌మెంట్ నిర్మించి, గత నవంబర్‌లో బోర్ వేయించి ఇంటి నిర్మాణం కోసం మున్సిపల్ ఆఫీస్ నుంచి అనుమతి పొంది పనులు ప్రారంభించాడు. ఇదిలా ఉండగా గత నెల పదో తేదీన రాత్రి 10.30 గంటల సమయంలో సుమారు 12 మంది గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి 8 పిల్లర్లతో సహా నీటి సంపు, ఇంటి నిర్మాణానికి వినియోగించే సామగ్రి ధ్వంసం చేశారు. సైట్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో రికార్డు కాగా, అనుమండ్ల రవీందర్ కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు విచారణ చేపట్టగా కరీంనగర్‌లోని చైతన్యపురి కాలనీకి చెందిన తోట శ్రీపతి రావు అనే వ్యక్తి పొన్నాల కనకయ్య, పవన్, సిరిపురం వెంకటరాజు మరి కొంత మందితో ఇంటి నిర్మాణాన్ని కూల్చివేయించినట్లు తేలింది. విషయం తెలిసిన నిందితుడు పరారు కాగా, పోలీసులు స్పెషల్ టీంను ఏర్పాటు చేసి గాలించారు. హైదరాబాద్‌లోని అంబర్‌పేట్‌లో సోదరుడి ఇంట్లో ఉన్నట్లు గుర్తించిన స్పెషల్ టీం పోలీసులు సోమవారం అర్ధరాత్రి తోట శ్రీపతిరావును అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం తెల్లవారు జామున కరీంనగర్‌కు తీసుకువచ్చి, కోర్టులో హాజరు పరుచగా కేసును పరిశీలించిన న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. ఈ కేసులో విచారణ ఇంకా కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి

జమ్మికుంట: విద్యార్థినులకు కరపత్రాలు అందిస్తున్న డిగ్రీ కళాశాల లెక్చరర్స్, ప్రిన్సిపాల్

జమ్మికుంట/ వీణవంక, ఫిబ్రవరి 6: ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని జమ్మికుంట డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్ కోరారు. మంగళవారం ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో అధ్యాపకులు వీణవంక మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఘన్ముక్ల మోడల్ స్కూల్, జమ్మికుంట ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులను కలిశారు. కరపత్రాలు అందించారు. కళాశాలలోని సౌకర్యాలు, అందిస్తున్న కోర్సులు, తదితర అంశాలను వివరించారు. కాలేజీలో చేరి మంచి భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. అడ్మిషన్ తీసుకోవాలనుకునే విద్యార్థులు దోస్త్ ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇక్కడ అధ్యాపకులు రామ్మోహన్‌రావు, ఈశ్వరయ్య, స్వరూపారాణి, రవీందర్, తదితరులున్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

చొప్పదండి, ఫిబ్రవరి 6: నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం ప్రత్యేక తరగతుల్లో అల్పాహారం కోసం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తన మొదటి నెల వేతనంపై అందించడంపై చొప్పదండి, కాట్నపల్లి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

అనుచిత వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలి

హుజూరాబాద్‌టౌన్, ఫిబ్రవరి 6: ఇటీవల ఇంద్రవెల్లి బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన స్థాయిని మరిచి బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఉద్దేశించి చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని బీఆర్‌ఎస్వై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల రాజలింగారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 10 ఏళ్ల పాటు తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శంగా నిలిపిన కేసీఆర్‌ను మరోసారి విమర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

తాజా మాజీ పాలకవర్గానికి సత్కారం



తిమ్మాపూర్: మన్నెంపల్లిలో తాజా మాజీ పాలకవర్గ సభ్యులను సన్మానిస్తున్న గ్రామస్తులు

తిమ్మాపూర్/ సైదాపూర్, ఫిబ్రవరి 6: తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామంలో తాజా మాజీ సర్పంచ్ మేడి అంజయ్య, ఉప సర్పంచ్ పొన్నం అనిల్ గౌడ్, వార్డు సభ్యులను మంగళవారం గ్రామస్తులు శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. సైదాపూర్ మండలం ఎక్లాస్‌పూర్ గ్రామంలో తాజా మాజీ సర్పంచ్ కొత్త రాజిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ మాలతిని మహిళా గ్రామైక్య సంఘాల ఆధ్వర్యంలో మహిళలు సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'గృహజ్యోతి' అమలుకు వివరాల సేకరణ

ముకరంపుర, ఫిబ్రవరి 6: గృహజ్యోతి అమలు కోసం విద్యుత్ శాఖ అధికారులు సర్వీసుల వారీగా డేటా సేకరణలో నిమగ్నమయ్యారు. ప్రధానంగా ఆహార భద్రతా కార్డు ప్రామాణికంగా మారగా, ఆధార్, సెల్ నంబర్ వివరాలను సేకరిస్తున్నారు. అయితే సర్వీసు వారీగా గృహజ్యోతి వివరాలను సేకరించి, అక్కడికక్కడే నమోదు చేసేలా సాఫ్ట్‌వేర్‌ను సైతం అప్‌డేట్ చేసినట్లు సమాచారం. ఈ యంత్రాల ద్వారానే ప్రస్తుతం 'గృహజ్యోతి' డేటాను సేకరిస్తున్నారు.

'రైతు బీమా' అమలుకు సహకరించాలి

ఇల్లందకుంట, ఫిబ్రవరి 6: ఎవరైనా రైతు చనిపోయినప్పుడు వారికి సంబంధించిన రైతు బీమా పత్రాలను కుటుంబ సభ్యులు సంబంధిత క్లస్టర్ ఏఈవోకు అందించి బీమా పథకం అమలుకు సహకరించాలని ఏవో రజిత కోరారు. మంగళవారం ఏవో కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ, ఇటీవల మండలంలో పలువురు రైతులు మృతి చెందగా, వారి ఇంటికి వెళ్లినా సంబంధిత బీమా పత్రాలను కుటుంబ సభ్యులు ఇవ్వడం లేదన్నారు. రైతుల కుటుంబీకులు సహకరిస్తేనే బీమా పరిహారం అందుతుందని స్పష్టం చేశారు.

వాగేశ్వరిలో అట్టహాసంగా ఫ్రెషర్స్ డే

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 6: జిల్లా కేంద్రంలోని వాగేశ్వరి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు మంగళవారం ఫ్రెషర్స్ డే అట్టహాసంగా నిర్వహించారు. నగర శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వేడుకలను ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్, వాగేశ్వరి విద్యాసంస్థల అధినేత బీ వేణుగోపాలరెడ్డి ప్రారంభించారు.

మాజీ సర్పంచ్ ఔదార్యం

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 6: చామనపల్లిలోని రాజసముద్రం చెరువు నింపేందుకు ఎస్సారెస్పీ కాలువ నుంచి మాజీ సర్పంచ్ బోగొండ లక్ష్మీఐలయ్య మంగళవారం పైపులైన్ వేయించారు. రైతులు లక్ష్మణ్‌రావు, గంగయ్య, ఎల్లాగౌడ్, మహేశ్, పోచమల్లు, మల్లేశ్ పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టరేట్, ఫిబ్రవరి 6: ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని బీసీలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమాధికారి అనిల్ ప్రకాశ్ కోరారు. నగరంలోని వెనుకబడిన తరగతుల అభివృద్ధి కార్యాలయంలో మంగళవారం పలు కుల సంఘాల అధ్యక్షులకు పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా బీసీ సంక్షేమాధికారి మాట్లాడుతూ, 18 కుల వృత్తులు చేసుకునే వారికి ఈ పథకం వర్తిస్తుందని వెల్లడించారు. అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు వెబ్‌సైట్ dcdi-hyd@dcmsme. gov.inలో చూడాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నవీన్‌కుమార్, పలు కుల సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

డ్రాగన్ ఫ్రూట్ ప్లాంటేషన్ ఏర్పాటు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 6: కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన రైతులు అనుముల వేణు, ఊరడి తిరుపతి వ్యవసాయ క్షేత్రాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా డ్రాగన్ ఫ్రూట్ ప్లాంటేషన్‌ను మంగళవారం ఎంపీడీవో దివ్యదర్శన్ రావు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏపీవో శోభ, పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్ బాల్ జట్టు ఎంపిక పోటీలు

చొప్పదండి, ఫిబ్రవరి 6: చొప్పదండి జడ్పీ ఉన్నత పాఠశాల (బాలుర) క్రీడా మైదానంలో జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి సాఫ్ట్ బాల్ (బాలుర) జట్టు ఎంపిక పోటీలను పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు రబియా ప్రారంభించారు. ఈ పోటీలకు చొప్పదండి, గుమ్లాపూర్, మానకొండూర్, కరీంనగర్, అన్నారం గ్రామాల నుంచి 60 మంది క్రీడాకారులు హాజరయ్యారు. సాఫ్ట్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్, పాఠశాల పీడీ కృష్ణ, పీఈటీ మర్రి చంద్రశేఖర్, క్రీడాకారులు ఆకాశ్, అంజన్ సాయి పాల్గొన్నారు.

ఎల్ఐసీ కొత్త పాలసీ ఆవిష్కరణ

విద్యానగర్, ఫిబ్రవరి 6: ఎల్ఐసీ కొత్త పాలసీ ఇండెక్స్ ప్లస్ జీవిత బీమా ప్లాన్‌ను కరీంనగర్ సీనియర్ డివిజనల్ మేనేజర్ ప్రసాద్ రావు మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ ఎంఆర్ శ్రీనివాస్, సేల్స్ మేనేజర్ రాజేశ్ ఖన్నా, ప్రొడక్ట్ మేనేజర్ పాండురంగారావు, డివిజనల్ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

శ్రీరాముడి పేరిట బీజేపీ రాజకీయాలు

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 3: శ్రీరాముడి పేరిట బీజేపీ రాజకీయాలు చేస్తున్నదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ విమర్శించారు. నగరంలోని సంఘ కార్యాలయం (బద్దం ఎల్లారెడ్డి భవనం)లో మంగళవారం నిర్వహించిన ఆల్ ట్రేడ్ యూనియన్ జిల్లా స్థాయి సదస్సులో ఆయన మాట్లాడారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ముకుందరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బుచ్చన్న, నాయకులు సమ్మయ్య, శ్రీనివాస్‌రెడ్డి, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వలసజీవికి కడుపుకోత

- చిన్నారిని చిదిమేసిన వాటర్ క్యాన్ సప్లై ఆటో
- రివర్స్ తీస్తుండగా టైర్ల కింద పడి మృతి
- చింతకుంటలో ఘటన



నూతన శ్రీ (ఫైల్)

రాంనగర్, ఫిబ్రవరి 6: బతుకుదెరువు కోసం పొట్టచేతపట్టుకొని వచ్చిన వలస జీవి కుటుంబానికి కడుపుకోతే మిగిలింది. అప్పటిదాకా బుడిబుడి అడుగులు వేస్తూ తమ కండ్ల ముందే తిరిగిన 16 నెలల చిన్నారి ఆటో కింద పడి విగతజీవిగా మారడంతో గుండె పగిలింది. ఒక్కగానొక్క కూతురు మృతిచెందడంతో ఆ తల్లిదండ్రులు రోదించిన తీరు కలిచివేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజమండ్రికి చెందిన ఆనంద్‌ది చాలా పేద కుటుంబం. రోజూ పనిచేస్తేనే పూట గడుస్తుంది. ఈ క్రమంలో ఫైబర్ నెట్ కేబుల్ తవ్వకాల కోసం కొన్ని నెలల క్రితం భార్య, కూతురుతో కలిసి కరీంనగర్ జిల్లా కేంద్రానికి వచ్చాడు. చింతకుంటలో స్థిరపడ్డాడు. కెనాల్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో గుడిసె వేసుకొని, స్థానికంగానే కందకం పనులు చేస్తూ బతుకుతున్నాడు. అయితే వారు తాగునీటి కోసం రోజూ మినరల్ వాటర్ తెప్పించుకునేవారు. మంగళవారం యథావిధిగా వాటర్ క్యాన్లు వేసేందుకు ఆటో వచ్చింది. క్యాన్ వేసిన తర్వాత డ్రైవర్ వెనుక గమనించకుండానే ఆటోను రివర్స్ తీశాడు. వెనుకాలే ఉన్న చిన్నారి వేముల నూతన శ్రీ (16 నెలలు)పై నుంచి ఆటో టైర్లు వెళ్లగా, తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. ఆనంద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కొత్తపల్లి పోలీసులు తెలిపారు.